# ''ఒక డిపార్ట్‌మెంటల్ ఎంక్వైరీ కథ''

కృష్ణారెడ్డి ఒక డిపార్ట్‌మెంటులో ఉన్నతాధికారిగా పనిచేస్తున్నాడు. ఆ డిపార్ట్ మెంటు ఏది? అనే ప్రశ్నకు ఈ కథలో ప్రసక్తి లేదు. (పొరపాటుగా డిపార్ట్‌మెంటు పేరు వ్రాస్తే అక్కడ కృష్ణారెడ్డి అనే ఒక పెద్ద ఆఫీసరు వుంటే, అతను వచ్చి రచయిత పీకపట్టు కుంటాడేమో!!). ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మొత్తం టూర్ చేసి, తన డిపార్ట్‌మెంటులో సిబ్బంది బాగా పనిచేస్తున్నారా! లేదా అనే బాధ్యతను చక్కగా నెరవేరుస్తున్న వ్యక్తి ఆయన. ఆయన నిజాయితీ పరుడనీ, సమర్థుడనీ, క్రమశిక్షణ విషయంలో చాలా నిష్కర్షగా ఉండే అధికారి అని ఆంధ్ర రాష్ట్రంలో చాలామంది ఆయన గురించి చెప్పుకుంటుంటారు. తన విధి నిర్వహణ పరిధిలో, చాలామంది సిబ్బందికి ఆయన ఎంతో సహాయం చేశాడు. దాంతోపాటు డిపార్ట్‌మెంటులో పూర్తి బద్ధకస్తులను, అవినీతి పరులను ఇంటికి పంపించడానికి ఏమాత్రం వెనుకాడలేదు.

కృష్ణారెడ్డిగారి కింద, విశాఖపట్నం జిల్లాలో పనిచేస్తున్న ఒక ఆఫీసరు నరసింహయ్య. అతను ఒక జిల్లాస్థాయి అధికారి కావడంవల్ల, కృష్ణారెడ్డి ఆయనను చాలా మర్యాదగా చూసేవాడు. విశాఖపట్టణం జిల్లా సందర్శించే సందర్భాలలో కృష్ణారెడ్డితో టూర్ చెయ్యడం నరసింహయ్యకు ఉద్యోగరీత్యా అవసరం. అలాంటి సందర్భాలలో కృష్ణారెడ్డి తన మిత్రుల ఇళ్లకు డిన్నరకు వెళ్లేటప్పుడు నరసింహయ్యను కూడా తీసుకొని వెళ్తుండేవాడు. ఒకసారి ఆయన నరసింహయ్య ఇంటికి వెళ్లడమూ, అక్కడ అల్పాహారం తీసుకోవడం జరిగింది.

నరసింహయ్యపైన కొన్ని ఫిర్యాదులు, ఆరోపణలు రావడంతో కృష్ణారెడ్డి లోగడ చాలా సార్లు ఆయన్ని హెచ్చరించి మంచి సలహాలు కూడా ఇచ్చాడు. కొన్ని లిఖిత తాకీదులు కూడా ఇచ్చారు. కాని నరసింహయ్య తన పద్ధతిని మార్చుకోవడానికి అసలు ప్రయత్నమే చేయలేదు. చివరకు ఒక ఆడిట్ పార్టీ నరసింహయ్య ఆఫీసును ఆయన అధీనంలో ఉన్న ఇంకా కొన్ని ఆఫీసులను తనిఖీచేసి, నరసింహయ్యకు వ్యతిరేకంగా చాలా ఆరోపణలు వున్నట్టుగా ఒక రిపోర్టు రావడంవల్ల కృష్ణారెడ్డి అతన్ని సస్పెన్షన్లో పెట్టారు. ఇక్కడ నుంచి మన కథ మొదలవుతుంది.

డిపార్ట్‌మెంట్ ఎంక్వైరీకి నియమితుడైన ఆఫీసరు, ఆ ఎంక్వైరీ గురించి నరసింహయ్యకు ఒక మెమో పంపించాడు. దానిపై తన ప్రాథమిక సంజాయిషీగా పంపించిన జవాబులో కృష్ణారెడ్డి మీద ఆయన కొన్ని నీచమైన ఆరోపణలను చేర్చాడు. ఆయన పరమ తాగుబోతని, స్త్రీలోలుడని (లంపటుడని), ఆయన జిల్లాలో టూర్ చేసే రోజులలో, జిల్లా అధికారులనుంచి స్కాచ్ తదితర కార్యక్రమాలు కొనసాగించడం

మామూలని, తన శక్తి మేరకు తానుకూడా ఆయనకు ఆనందం కలుగజేయడానికి ప్రయత్నం చేశానని, కాని దానికి ఖర్చులు, విపరీతంగా పెరుగుతూ పోతుండడంవల్ల ఆయన అడిగినదల్లా ఇవ్వటానికి తనకు తలకు మించిన భారం అయిపోయిందనీ ఇంకా ఏమాత్రం ఇవ్వలేని పరిస్థితి వచ్చేసరికి తనను ఆయన సస్పెన్షలో పెట్టారనీ ఆయన రాసిన ఆరోపణా పరంపరల సారాంశం.

డిపార్ట్‌మెంటల్ ఎంక్వైరీ మొదలయింది. ఆనాడు శుభ సోమవారం. ఉదయం సరిగ్గా 11 గంటలకు కృష్ణారెడ్డి ఎంక్వైరీ ఆఫీసరు ముందు హాజరయ్యాడు. ఉద్యోగ రీత్యా, తనకంటే తక్కువ శ్రేణి అధికారి అయిన ఆ ఎంక్వైరీ ఆఫీసరు, ఆయన్ని చూడగానే దిగ్గున లేచి నమస్కరించి, కూర్చోమన్నారు. ''సారీ! సర్'', తమర్ని నా గదికి పిలిపించడం నాకు చాలా బాధగా వుందని విషణ్ణ వదనాన్ని ప్రదర్శించాడు.

''దట్స్ ఆల్ రైట్'', ఇలాంటి ఎన్నో ఎంక్వైరీలకు మేము అటెండ్ అయ్యాం గదా. యు క్యారీ ఆన్ విత్ యువర్ నార్మల్ ప్రొసీజర్. కాని నా స్టేటుమెంట్ రికార్డు చేసేటప్పుడు, ఆ నరసింహయ్య తప్ప ఎవరూ ఈ గదిలో వుండగూడదు. నేను చెప్పేది వేరే ఎవరూ వినకూడదు. ఇందులో కొంచెం తమాషా జరుగబోతుంది'' చిరునవ్వుతో, కృష్ణారెడ్డి అన్నాడు.

తన క్యాంప్ క్లర్క్ గదిలో , నక్కి వున్న నరసింహయ్యను ఆయన పిలిపించాడు. కృష్ణారెడ్డి ముఖంలోకి చూసే ధైర్యం చాలకపోయినా, వారికి అభివాదనం చేయకుండా వుండ లేకపోయాడు. మందహాసంతో, ''ఏం నరసింహయ్య బావున్నావు గదా!'' అని కృష్ణారెడ్డి అడిగేటప్పుడు ''థాంక్యూ సర్'' అని జవాబు గొణుగుతూ. ఇంక ఏం చెయ్యాలా, అని తికమకలో పడ్డాడు. ఎంక్వైరీ ఆఫీసరు అతనిని కూర్చోమని చెబితే ''వద్దుసర్ నేను నిలబడే వుంటాను'' అని చెప్పాడు. కానీ, ఆ ఆఫీసరు మళ్లీ మళ్లీ చెప్పడంతో నరసింహయ్య కుర్చీకి ఆనీ ఆననట్లు ముళ్లమీద కూర్చున్నట్టు కూర్చున్నాడు.

ఎంక్వైరీ ఆఫీసరు తన కార్యక్రమం మొదలు పెట్టడానికి సన్నద్ధుడయ్యాడు. ''సర్, ఇక స్టార్ట్ చేద్దామా'' అని అడిగాడు. ''ఒ.కె. అయామ్ రడీ, నా స్టేట్‌మెంట్ రికార్డు చేసుకోండి'' అని చెప్పి కృష్ణారెడ్డి గొంతు సవరించుకొని మొదలు పెట్టారు. ముందు తన ఉద్యోగం గురించి క్లుప్తంగా వివరించన తర్వాత రెండవ సారిగా, ఆయన ఇలా చెప్పారు.

''ఆరోపణలకు గురియైన ఆఫీసరు తన ప్రథమ సంజాయిషీలో నాపైన మోపిన అభియోగాలన్నీ నిజమే.''

ఎంక్వైరీ ఆఫీసరు కనుగుడ్లు రెండూ ముందుకు పొడుచుకొచ్చాయి. నరసింహయ్యకైతే కనుగుడ్లు పొడుచుకు రావడమే కాదు. నోరుకూడా తెరుచుకొని ఉండిపోయింది. వారిద్దరూ తమ చెవుల్ని, తామే నమ్మలేకపోయారు. ఎంక్వైరీ ఆఫీసరుతో కృష్ణారెడ్డి ''ఊ! రాసుకోండి, ఇందులో అంత ఆశ్చర్య పడాల్సింది ఏమీ లేదు.''

ఎంక్వైరీ ఆఫీసరు వారు చెప్పేమాటలు అలాగే వ్రాయటం మొదలుపెట్టారు.

''త్రాగటం అంటే నాకు మహా ఇష్టం. పరస్త్రీ సంపర్కం గూడా నాకు ఇష్టమైనదే. అందుకే నేను టూర్ వెళ్లేటప్పుడు ఈ రెండు సౌకర్యాలు లభిస్తే మాత్రం వదిలే ప్రశ్న లేదు. ఛాన్స్ దొరికితే నేను ఎంజాయ్ చేస్తాను. కొన్ని జిల్లాలలో ఈ సౌకర్యాలు అసలు లేనే లేవు. ఇలాంటి విషయాలవల్ల ఇబ్బందిలో పడడం బుద్ధి తక్కువ తనంకాదా? మంచి సిటీలలో, టౌన్లలో, నా మిత్రులుండటం వల్ల అంతా సజావుగా జరిగిపోతుంది. మామూలుగా సిబ్బందిని ఇలాంటి విషయాలలో నేను ఇబ్బంది పెట్టను. కాని, నరసింహయ్య అనే ఈ ఆఫీసరు మొదటినుంచీ నాకు చాలా దగ్గరగా వుండటానికి ప్రయత్నం చేసేవాడు. విశాఖపట్టణం నేను వెళ్ళినప్పుడల్లా నాకు ఎంతో సత్కారం చేసేవాడు. మామూలుగా, ఈయన నాకు నాణ్యమైన స్కాచ్ ఇస్తూ వుండటం చేత, వేరే మిత్రులు అవసరం కలిగేది కాదు.''

నరసింహయ్య కనుగుడ్లు మరింత ముందుకు పొడుచుకొచ్చాయి. కృష్ణారెడ్డి ఇంకా చెప్పసాగాడు.

''ఇలా వుంటుండగా, ఒకరోజు తన ఇంటికిరాత్రి భోజనానికి తీసుకెళ్లారు. శ్రీమతి నరసింహయ్య, అతిథి సత్కారాలలో అందెవేసిన, అందమైన ఆడది. ప్రథమ దర్శనంలోనే ఆమె నన్ను ఆకట్టుకుంది. ఆ మహిళామణి, స్వహస్తాలతో అద్వితీయమైన ఆ స్కాచ్ కొసరి కొసరి పోసిచ్చింది.''

''అది కరెక్టు కాదు సర్, నా భార్య మద్యం సీసా ఛాయలకైనా పోలేదు. ఆమె పరపురుషులును కన్నెతి గూడా చూడని అమాయకురాలండీ'' అని ఏడ్వడం మొదలు పెట్టాడు నరసింహయ్య.

మళ్లీ కృష్ణారెడ్డి మోమున చిరునవ్వు తొంగి చూసింది. ''ఒక ఎంక్వైరీ ఆఫీసరుగా, మీరు ఈ అక్యూజ్డ్ ఆఫీసరును కంట్రోలు చేయడం చాలా అవసరం. నా స్టేట్ మెంట్ రికార్డు చేసేటప్పుడు, మధ్యలో ఇతను ఏం చెప్పకూడదు. నన్ను క్రాస్ ఎగ్జామినేషన్ చేయడానికి ఇతనికి పూర్తి అవకాశం తర్వాత వస్తుంది గదా! అప్పుడు, ఈయన నన్ను ఇష్టమొచ్చిన ప్రశ్నలు వేయవచ్చు. నా స్టేట్ మెంటు పూర్తయ్యేవరకు ఈయన్ని నిశ్శబ్దంగా వుండమని చెప్పండి.''

''ఇలాంటి ఎంక్వైరీల ప్రొసీజరు మీకు తెలుసు గదా! మీరు అడగవల్సినదంతా క్రాస్ ఎగ్జామినేషన్ టైములో అడగండి'' అని నరసింహయ్యను ఆదేశించి ఎంక్వైరీ ఆఫీసరు, కృష్ణారెడ్డి గారితో ''సర్ మీరు కానివ్వండి'' అని చెప్పాడు.

అప్పుడు కృష్ణారెడ్డి -

''శ్రీమతి నరసింహయ్య, నాకూ నరసింహయ్యకు గ్లాసుల్లో నింపుతూ, తన కూడా ఒక గ్లాసు నింపుకుంది.''

''అయ్యో, అయ్యో, ఇది మరీ అన్యాయం'' అని నరసింహయ్య లబోదిబోమన్నాడు. ఎంక్వైరీ ఆఫీసరు అతణ్ణి తీక్షణంగా చూసి, తన చూపుడు వేలును పెదవులకు ఆనించి నిశ్శబ్దంగా వుండమని సైగ చేశాడు.

''కొద్దిగా తీసుకున్నాక, ఈ నరసింహయ్య గురకలు పెడుతూ నిద్రపోయాడు. పాపం, భోజనంగూడా చేయలేదు. ఆ రాత్రే నాకు మంచి భోజనం పెట్టి, నన్ను పడక గదిలోకి తూలుతూ తీసుకెళ్ళింది'' అని కృష్ణారెడ్డి చెప్పుకుపోతున్నాడు.

''అయ్యో, ఇంక నేను భరించలేను'', కావాలంటే మీరు నన్ను చంపండి, నా భార్యను అవమానం పాలు చెయ్యాలంటే అది నాముందే చేయాలా! నేను బయటకు వెళతాను. తర్వాత మీ ఇష్టమొచ్చినట్లు చెప్పుకోండి, రాసుకోండి'' అని కేకలు పెడుతూ నరసింహయ్య కుర్చీలోంచి లేచాడు.

''యు సిట్‌డౌన్ దేర్. ఇది కోర్టు అనే విషయం మీరు మరువకూడదు. ఒక విచారణ జరిగేటప్పుడు అనేక విషయాలు వినవల్సి వస్తుంది. మీరు నిశ్శబ్దంగా కూర్చోవడం అవసరం. మీరు చెప్పవలసిందంతా క్రాస్ ఎగ్జామినేషన్ చేసేటప్పుడు చెప్పండి కూర్చోండి'' అని ఎంక్వైరీ ఆఫీసరు శాసించడంతో నరసింహయ్య కంటకాసనానికి మంటకూడ చేరినట్లు అరపావు కుర్చీలో ఒదిగి కూర్చున్నాడు.

కృష్ణారెడ్డి చెప్పసాగాడు ''ఇక్కడ ఆమెను దోషిగా నిరూపించడం నా ఉద్దేశం కాదు. నిజానికి ఆమెను ఈ విషయంలో దోషి అని అనడానికి కూడా వీలులేదు. ఆ రాత్రి తర్వాత, నేను మళ్లీ ఆ ఇంటికి వెళ్లలేదు. కాని, విశాఖపట్టణంలో మకాం చేసినప్పుడల్లా, రాత్రి 11లేక 11.30 గంటలకు ఈ దంపతులు రహస్యంగా నా గదికి వచ్చేవారు.

కుక్క కరిచిన వాడిలాగా నరసింహయ్య పేరిణి తాండవం చేస్తూ ఆక్రోశించాడు. ''ఇది పచ్చి అబద్ధం, సార్, తమరింత క్రూరంగా మాట్లాడకూడదు. ఇంక ఏం చెప్పొద్దు. ఏ శిక్షకయినా నేను సిద్ధమే. మీరు నన్నింక చిత్రహించ పెట్టకండి.''

ఈసారి, ఎంక్వైరీ ఆఫీసరుకు గర్జించక తప్పలేదు. ''విల్ యు కీప్ క్వైట్ అండ్ కీప్ సిట్టింగ్? యువర్ టర్న్ విల్ కమ్ సూన్''.

ఆ గర్జన స్వరంపట్ల కావచ్చు - ముళ్లు, మంట, అంతా మరచిపోయి, నరసింహయ్య నిస్సత్తువగా కుర్చీలో కూలబడిపోయాడు. అతను రొప్పుతూ, చెమటలు కారుస్తూ వణికిపోతున్నాడు.

కృష్ణారెడ్డి మళ్లీ చెప్పడం మొదలు పెట్టాడు. ''ఈ నరసింహయ్య పూర్తి పురుషుడు కాదట. శక్తి లేకపోతే మానె, ఆసక్తి కూడా లేదని ఆమె చెప్పింది... ఆమెకున్న ఇద్దరు పిల్లలు కూడా ధర్మ సంతానమేనట.'' నరసింహయ్య, ఒక్కసారిగా బుస కొట్టాడు. అతడు ఒక రౌద్ర నరసింహుడిగా మారిపోయాడు. కృష్ణారెడ్డిని ''స్మాష్'' చేయడానికి కుర్చీలోంచి ఒక్క గెంతు గెంతాడు. కృష్ణారెడ్డి ఒక్క చేత్తోనే అతన్ని ఆపాడు. ఎంక్వైరీ ఆఫీసరు నరసింహయ్యను ప్రక్కకు నెట్టి, బాగా తిట్టి, ఒక గట్టి వార్నింగిచ్చాడు. అప్పుడు నరసింహయ్య తను జుట్టు మొత్తం పీక్కునే మహాయజ్ఞంలో వున్నాడు. ఒక చిన్న పిల్లాడిలా వెక్కి వెక్కి ఏడ్చాడు.

ఎంక్వైరీ సాగుతూంది. కృష్ణారెడ్డి ఇంక చెప్పాల్సిందల్లా ఔద్యోగిక విషయాలు మాత్రమే. నరసింహయ్య మళ్లీ అల్లరి ఏమీ చేయలేదు. అతను ఒక అర్ధబోధానస్థలో వున్నాడు.

''మీరింక, ఈసార్‌ని క్రాస్ ఎగ్జామిన్ చేయవచ్చు'' అని ఎంక్వైరీ ఆఫీసరు అతనితో బిగ్గరగా చెప్పేటప్పుడు నరసింహయ్య, ఈ లోకానికి తిరిగి వచ్చాడు.

''నా కెవర్నీ క్రాస్ చెయ్యవలసిన అవసరం లేదు. కాని, ఈ సార్ ఇంత దుర్మార్గుడని, నేను ఎప్పుడూ అనుకోలేదు.''

కృష్ణారెడ్డి సాక్షాత్ కృష్ణపరమాత్మలాగా, ఒక డిప్లొమాటిక్ చిరునవ్వు చిందించాడు.

''నరసింహయ్యా, నేనొక దుర్మార్గుడనని, మీరు ఇప్పుడను కుంటున్నారా?''

''సార్, నాగురించి, నా భార్య గురించి ఇంత నీచంగా మాట్లాడిన తర్వాతకూడా వెనుకటి రోజుల్లో మీమీదున్న అభిప్రాయం ఇంకా వుండాలా?''

''అయితే, నాగురించి మంచి అభిప్రాయం మీకు ఒకప్పుడు వుండేదన్నమాట. ఆ అభిప్రాయం చెడ్డగా ఎప్పుడు మారింది.''

''తమరు ఈ అశ్లీలాలన్నీ వల్లించేటప్పుడు.''

''అయితే, ఒక అరగంట క్రిందటి వరకు, నేను మంచివాడినే నన్నమాట.''

''నిశ్చయంగా, కాని తమ నాలుకమీద ఈ పంకిలం ఎలా పుట్టింది?''

''నేను మంచి వాడినని, మీకు అభిప్రాయం ఉన్నా కూడా, నీ ప్రథమ సంజాయిషీలో నన్ను అంత చెడ్డవాడిగా ఎలా చిత్రించగలిగావు? నామీద, మీరు అంత బురద జల్లినప్పుడు అది నేను ఒప్పుకోవడంలో తప్పేముంది? కాని, నన్ను కంపుకొట్టించిన ప్పుడ, మీరు కంపుకొట్టకూడదా!''

''అయ్యో! సారూ! మిమ్మల్ని దూషించాలని నేనూ ఎప్పుడూ అనుకోలేదు. ఈ సంజాయిషీ, ఒక వకీలు మిత్రుడు రాసిచ్చాడండీ. ఈ ఛార్జీలోంచి బయటపడటానికి, ఇది ఒకటే మార్గమని అలా రాసిచ్చాడు.''

''నన్ను నీచంగా, చిత్రిస్తే మీరు గూడ ఆ నీచత్వాన్ని పంచుకోవాల్సిందే.''

''నరసింహయ్య ఒక్క దూకు దూకి, కృష్ణారెడ్డికి సాష్టాంగ నమస్కారం చేసి, అతని కాళ్లు గట్టిగా పట్టుకొని బిగ్గరగా ఏడ్వడం మొదలు పెట్టాడు.

''సార్, నాకు ఒక్కసారి క్షమాభిక్ష పెట్టండి. బుద్ధి గడ్డితిని పాడుపనులన్నీ చేశా. అది చాలక, ఆ భేతాళం మాటలు విని తమర్ని దూషించేదాని క్కూడా నేను సిద్ధపడ్డాను. నాకు ఎంత శిక్ష విధించినా అది ఎక్కువగాదు. సార్, నన్ను ఉద్యోగం నుంచి తీసివేయండి. కావాలంటే నన్ను జైలుకు కూడా పంపండి. కానీ, నా భార్య గురించి, పిల్లల గురించి తమరు రికార్డు చేయించినవి...''

''లే, లే! నరసింహయ్య! ఏడ్వవద్దు. రికార్డు చేసినదంతా చింపేస్తాను. మీ తప్పులు కనీసం ఇప్పటికయినా తెలిసొచ్చాయి గదా! ఇంక ఆ కుర్చీలో కూర్చోండి. ఈ ఎంక్వైరీ త్వరగా ముగించేయడానికి, మనం సహకరించాలి గదా! లేవండి.''

కరుణతో కృష్ణారెడ్డి అతన్ని లేపి కుర్చీలో కూర్చోబెట్టారు. ఎంక్వైరీ ఆఫీసరు వైపు చూసి, ''ఇప్పుడు నా ట్రిక్కు అర్థమైందా?'' అని స్ఫురించేలా చిరునవ్వు నవ్వాడు.

తర్వాత, ఆ డిపార్ట్‌మెంటల్ ఎంక్వైరీ ఒక ''మెంటల్'' ఎంక్వైరీగా కాకుండా, ఒక మామూలు ఎంక్వైరీగా పురోగమించింది.